

మర్యాదపూర్వక కలయిక

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖడ్‌ను న్యూఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్. (రాంనగర్-ఆంధ్రజ్యోతి)



బాగ్‌లింగంపల్లి లంబాడీ తండాలో నాయిని నర్సింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నాయిని పోరాటం మరువలేనిది: ఎమ్మెల్యే

రాంనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాల్లో నాయిని నర్సింహారెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి లంబాడీ తండాలో మాజీ హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి 4వ వర్ధంతి జరిగింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై నాయిని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయిని నర్సింహారెడ్డి కుమార్తె మమతారెడ్డి, కుమారుడు దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో అన్నదానం

నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేపం మల్లేష్, నగర సీనియర్ నాయకుడు సిరిగిరి శ్యామల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు.

నాయిని ఆశయ సాధనకు కృషి చేయాలి

కవాడిగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర తొలి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆశయ సాధనకు యువత, అభిమానులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయిని నాలుగో వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నగర నాయకుడు కల్వగోపి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో సమతారెడ్డి, రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు నాయిని దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని నాయిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నేతలు గోపి, బాలయ్య, శివ, మధు, మేకల శ్రీనివాస్‌యాదవ్, నితిన్, విఠల్, ఉదయ్, రాజు పాల్గొన్నారు.

నిజమైన ప్రజానాయకుడు నాయిని

చిక్కడపల్లి: నిజమైన ప్రజానాయకుడు నాయిని నర్సింహారెడ్డి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. జవహర్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పున్న సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. పార్టీ నేతలు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గడ్డమీది శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- జి. రాంబాబు, ముషీరాబాద్ సీఐ



రాంనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు నిబంధనల ప్రకారం, పోలీస్, అగ్నిమాపక, ట్రాన్స్‌కో శాఖల అనుమతులు పొందిన తర్వాతే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు హెచ్చరించారు. ఈనెల 31 జరిగే దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల యజమానులు, వ్యాపారులు పాటించాల్సిన నియమ నిబంధనలపై ఆంధ్రజ్యోతికి సీఐ రాంబాబు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు ఇవీ.

ఆంధ్రజ్యోతి: బాణసంచా దుకాణం పెట్టేందుకు ఎవరికి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

సీఐ : బాణసంచా వ్యాపారులు డీసీపీ నుంచి అనుమతి పొందాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దరఖాస్తును ఈసేవ నుంచి పొందాలి. అనుమతి వచ్చాకే షాపు ఏర్పాటు చేసుకోవాలి

ఏఏ శాఖల అనుమతులు తీసుకోవాలి? షాపుల వద్ద ఎలాంటి నిబంధనలు పాటించాలి?

ప్రతి వ్యాపారి తప్పనిసరిగా పోలీసు శాఖతోపాటు జీహెచ్ఎంసీ, ఫైర్‌సేఫ్టీ ట్రాన్స్‌కో అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. షాపుల వద్ద అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే మంటలు ఆర్పేందుకు డ్రమ్ నిండా నీరు, ఫైర్ నివారణ పరికరం, ఇసుక ఏర్పాటు చేసుకోవాలి. షాపుల మధ్య నిర్ణీత దూరం పాటించాలి.

అధిక ధరల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నిబంధనల ప్రకారం ఎమ్మార్పీకి టపాసులను అమ్మాలి. ప్రతి ఐటెమ్ రేటు లిస్టును షాపు ముందు బోరుపై ప్రకటించాలి. అధిక రేట్లకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. ఎక్కువ రేట్లకు అమ్మిన వ్యాపారులపై వినియోదారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

బాణసంచా దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలి ?

జనావాసాలకు దూరంగా షాపులు ఏర్పాటు చేయాలి. ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తాం. ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని ఆమ్‌దారా ఫంక్షన్ హాల్, ముషీరాబాద్ పార్కువద్ద షాపులకు అనుమతి ఇస్తాం. కొత్తగా ఎవరైనా బహిరంగ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తాం.

బాణసంచా అక్రమ నిల్వలపై ఎలాంటి నిఘా పెట్టారు?

నగర పోలీసు కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీ,చిక్కడపల్లి ఏసీపీల ఆదేశాల మేరకు ఇప్పటికే బాణా సంచా అక్రమ నిల్వలు, గోదాంలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. అనుమానిత ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నాం.

టపాసులు కాల్చే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

దీపావళి నాడు బాణసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు పిల్లల వెంట ఉండి కాల్చేలా చూడాలి. రోడ్లపె వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగించేలా కాల్చరాదు.

మీ ఇళ్లను ఎవ్వరూ కూల్చరు.. బీజేపీ మీకు అండగా ఉంటుంది

- మూసీ పరివాహక ప్రాంతవాసులకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హామీ

గోల్నాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): "భయపడకండి.. మీ ఇళ్లను ఎవ్వరూ కూల్చరు.. మీకు బీజేపీ అండగా ఉంటుందని గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఆ పార్టీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం రఘు నందన్‌రావు మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్లు, పార్టీ నేతలతో కలిసి గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్, తులసీ రాంనగర్(లంక) తదితర మూసీ పరివాక ప్రాంతాల్లో పర్యటించారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశం మేరకు మూసీ పరివాహక ప్రాంత ప్రజల్లో భయాన్ని పోగొట్టి భరోసా కల్పించేందుకు వచ్చామన్నారు. బాధితులతో మాట్లాడి వారి గోడు విన్నారు. తమకు నాయం చేయాలని, తాము ఇళ్లను వదిలి ఎక్కడికీ వెళ్లే ప్రసక్తే లేదని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న స్థితిలో మూసీ సుందరీకరణకు చర్య లు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా మూసీ ప్రస్తుతం ఉన్న విధంగానే సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మీ ఇళ్ల ఎవ్వరూ కూల్చరు, మీకు బీజేపీ అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మూసీకి రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేసి పేదల ఇళ్లకు ఎలాంటి హాని జరగకుండా చర్యలు తీసుకునేలా తమ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందన్నారు. పేదల విషయంలో రాజకీయాలొద్దు, అందరం వారికి న్యాయం జరిగేలా పనిచేద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆయన సూచించారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, వై.అమృత, బీజేపీ నాయకులు వనం రమేష్, ఏడెల్లి అజయ్‌కుమార్, కన్నెరమేష్‌యాదవ్, మూల రవీందర్‌గౌడ్, ఎం.శ్యామ్‌రాజ్, కేసరి నర్సింగ్‌రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తులసీరాంనగర్ (లంక) మూసీ పరివాక ప్రాంతంలో బాధితుల సమస్యలు వింటున్న ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ నాయకులు

27న ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్

రాంనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేలా ఈ నెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం నిర్వహిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఆదర్శ్‌నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కార్యాలయంలో సదర్ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 27వ తేదీ (ఆదివారం) ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు సదర్ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి యాదవులు, ఇతర వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరవుతున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో పోతరాజుల విన్యాసాలు, దీపావళి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మాజీ యూపీ సీఎం అఖిలేష్‌యాదవ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనా యాదవ్, నాయకులు రాజేష్‌యాదవ్, లోకేష్‌యాదవ్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, నాయకులు గౌరీ సతీష్ తదితరులు

25 నుంచి రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

- ఏఐపీకేఎస్ నేతల వెల్లడి

నల్లకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అఖిల భారత ప్రగతిశీల సంఘం (ఏఐపీకేఎస్) నేతలు వెల్లడించారు. మంగళవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఏఐపీకెఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చెల రంగారెడ్డి, వి.ప్రభాకర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా, షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ, సాగు చేసుకుంటున్న ప్రతి ఒక్కరికీ రెండు పంటలకు 15 వేల రూపాయలు రైతు భరోసా, పది రకాల పంటలకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక ఈ వాగ్దానాలను విస్మరిస్తున్నదని వారు ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని మం డల, జిల్లా కేంద్రాల్లో రైతుల ఆందోళన కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమం లో సంఘం ఉపాధ్యక్షుడు బి.రాము, ఎస్కే గౌస్, సహాయ కార్యదర్శులు బి.దేవారం, భిక్షం, సీహెచ్ రాంచందర్, ఎస్.సురేష్, కోశాధికరి ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెచ్చెల రంగారెడ్డి తదితరులు



డేబా విజయ్‌కుమార్‌కు సత్కారం

ఏపీలోని తాడేపల్లిగూడెంలో ఈ నెల20,21వ తేదీల్లో "ప్రపంచ తెలుగు సాహిత్య కళాజాతులు" పేరిట నిర్వహించిన కళా ఉత్సవంలో 24 గంటల నాన్‌స్టాప్ కళా ప్రదర్శనతో వరల్డ్ రికార్డ్ సాధించిన నగరానికి చెందిన శ్రీశ్రీ కళా వేదిక కల్చరల్ వింగ్ సంస్థ డైరెక్టర్ డేబా విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహక సంస్థ ప్రతినిధులు. (నల్లకుంట-ఆంధ్రజ్యోతి)

కుమరం భీమ్‌కు మంత్రి సురేఖ నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): అంధకారపు అణచివేత పొరలను చీలుస్తూ ఉదయించిన ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కొమురం భీమ్ జయంతి సందర్భంగా సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం మంత్రి సురేఖ కొమురం భీమ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆత్మగౌరవ పోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు కొమురం భీమ్ గొప్ప స్ఫూర్తినిచ్చాడని మంత్రి సురేఖ తెలిపారు.

కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైళ్లు రద్దు

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైలుకు ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 29, నవంబర్ 5, 12 తేదీల్లో కాచిగూడ-తిరుపతి(07063) రైలును రద్దు చేసినట్లు తెలిపారు. తిరుపతి-కాచిగూడ (07064) రైలు ఈ నెల 30న నవంబర్ 6, 13వ తేదీలలో బయలుదేరాల్సి ఉండగా, వీటిని కూడారద్దు చేశామన్నారు.



ఎమ్మెల్యే కాలేరు ను సత్కరిస్తున్న భూదేవి, నాగదేవతల ఆలయ కమిటీ సభ్యులు

భూదేవి, నాగదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు

గోల్నాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ మారుతీనగర్‌లోని శ్రీభూదేవి, నాగదేవతల ఆలయంలో మంగళ వారం ఆలయ కమిటీ, బస్తీ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కార్పొరేటర్, ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం ప్రజలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో బస్తీపెద్దలు ఎన్. లింగంయాదవ్, ఎ.సురేష్ గౌడ్, సత్యనారా యణ, కాపరనేని లింగం, పాక ధర్మేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్కే బాబు, ఆర్.రాము, భూపతి లక్ష్మణ్,బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు యాదవ్ పాల్గొన్నారు.



రామాంజనేయులుకు నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

గెజిటెడ్ అధికారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

చిక్కడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): గెజిటెడ్ అధికారుల సంక్షేమమే ధ్యేయంగా టీజీఓ సభ్యులు పనిచేయాలని టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. టీజీఓ హైదరాబాద్ జిల్లా కార్య వర్గ సభ్యులుగా నియమితులైన చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ కురుమ రామాంజనేయులుకు మంగళవారం టీజీఓ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఓ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా జాతిపిత గాంధీ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీల్‌వెల్ కార్పొరే షన్, శ్రుతిలయ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాల ప్రదానసభ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం. కోదండరెడ్డి, 103 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తిలకు స్ఫూర్తి పురస్కా రాలను ప్రదానం చేశారు. శ్రుతిలయ సంస్థ చైర్మన్ బొక్కా భీమ్‌రెడ్డి, వ్యవస్థాపకులు, ప్రముఖ గాయని ఆమని పర్యవేక్షణలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ అతిథులుగా పాల్గొని పురస్కారాలను బహూకరించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, మహాత్మాగాంధీ ఆశయాలను కొన్ని పార్టీలు మరిచి పోయాయని అన్నారు. తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే ముషీరాబాద్ ప్రజల ఆశీర్వాదమే కారణమన్నారు.



కోదండరెడ్డి, కృష్ణమూర్తిలకు మహాత్మాగాంధీ పురస్కారాలను బహూకరించిన అతిథులు

సందేశాన్నిచ్చేవి పద్యనాటకాలు

చిక్కడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో సినీగీత విభావరి జరిగింది. గాయనీ గాయకులు చంద్రతేజ, కేవీ రావు, అనూష, కల్యాణి, శ్రీకాంత్‌లు నాటి నేటి పాటలను మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హెలెన్ కెల్లెర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ పద్య నాటకాలు సమాజానికి మంచి సందే శాన్ని ఇస్తాయన్నారు. యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, చంద్రతేజ మంచి గాయకుడని, మోహనకృష్ణ వ్యాఖ్యానం అద్భుతంగా ఉంటుందని, వీరిని సన్మానించడం విశేషం అన్నారు. ఉపాధ్యాయురాలు సుశీల, నిర్వాహకులు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రతేజ, మోహనకృష్ణను సన్మానిస్తున్న ఉమర్‌ఖాన్

గీత కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ హయాంలో పెద్దపీట

- మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

రాంనగర్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన లో కల్లు గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశామని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని సంఘం 67వ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లె రవికుమార్, ఎస్.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బి.వెంకటనర్సయ్య, కృష్ణస్వామి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేకల పరశురామ్

రాంనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేకల పరశురామ్ నియమితు లయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆయన నియామకం ప్రకటించి మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరుశరామ్ మాట్లాడుతూ, బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కులను సాధించేందుకు తనవంతు పోరాటం చేస్తానన్నారు. బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, ఉదయ్‌నేత, పృథ్వీగౌడ్, బలరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పరశురామ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో దార్శనికుడు మోక్షగుండం

చిక్కడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపకల్పన చేసిన ప్రాజెక్టులు నేటికీ కూడా వినియోగంలో ఉన్నాయని, ఆయన భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో దార్శనికుడు అని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. మంగళవారం గానసభ ఆధ్వర్యంలో గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య యాదిలో సంస్మరణ సమావేశం జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఎస్‌బీఐ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, కాంగ్రెస్ నాయకురాలు శ్రీమణి, గానసభ పాలక మండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనార్ధనమూర్తి తదితరులు



ముషీరాబాద్ సాగర్ లాల్ ఆసుపత్రి వద్ద నిలిచిన వరద నీరు



రాజాడీలక్స్ చౌరస్తా వద్ద ఇదీ పరిస్థితి

ముషీరాబాద్‌లో భారీ వర్షం: రోడ్లు జలమయం

ముషీరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలలో వరద నీరు పెద్ద ఎత్తున ప్ర వహించడం వల్ల పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ముషీరాబాద్ సాగర్ లాల్ ఆసు పత్రి సమీపంలో రాజాడీలక్స్ ప్రధాన రోడ్డు,పార్శిగుట్ట ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోయాయి. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీనికి తోడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు నిండి పొంగి పొర్లాయి.

దీపావళి, ఛత్ పండుగలకు 804 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా 804 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి రైళ్లను నడుపుతామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం ప్రత్యేక రైళ్ల సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌ల్లో ప్రయాణించాలనుకునేవారు యూటీఎస్ మొబైల్‌యాప్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

బాగ్ అంబర్‌పేటలో కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

నల్లకుంట, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో నెలకొన్న కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, సమ స్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి కోరారు. మంగళవారం డివిజన్‌లోని పలు కాలనీ, బస్తీవాసులకు కుక్క లు, కోతుల బెడదపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వీధులు, రహదారుల్లో తిరుగు తున్న వీధి కుక్కలు, కోతుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.



దీపావళి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం బర్కత్‌పురలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు అరవింద్, కృష్ణకుమార్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు. (బర్కత్‌పుర- ఆంధ్రజ్యోతి)

ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- జాతీయ ఓబీసీ సంఘం అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించా లని, బీసీలపై విధించిన క్రిమిలేయర్‌ను రూ. 30 లక్షలకు పెంచాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా విధించాలని జాతీయ ఓబీసీ సంఘం అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరానికి వచ్చిన ఓబీసీ పార్లమెంట్ కమిటీ చైర్‌పర్సన్ గణేష్‌సింగ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఓబీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 52 శాతం పెంచాలని, కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఐఐటీ, ఐఐఎం, ట్రిబుల్ ఐఐటీ చదివే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో ఓబీసీ మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లపై చైర్‌పర్సన్ గణేష్‌సింగ్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ ప్రతినిధులు చిన్నయ్య, రవికుమార్, జయప్రకాష్, లలిత, చందన, శ్రీనివాస్‌గౌడ్, యాకయ్య, పూర్ణచందర్‌రావు, శ్రీధర్ రమేష్, ఎస్ఎస్.చారి తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీ పార్లమెంట్ కమిటీ చైర్‌పర్సన్ గణేష్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప కథనం ప్రకారం... సికింద్రాబాద్ దూద్‌బౌలికి చెందిన సయ్యద్ అస్లాం (70) ఈ నెల 20వ తేదీన సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ నుంచి మలక్‌పేటకు రైలులో వెళ్తుండగా మలక్‌పేట వద్ద రైలు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతి చెందాడు.

రైలులో మహిళ బ్యాగు చోరీ

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైలులో ఓ మహిళ బ్యాగు చోరీ జరిగింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప కథనం ప్రకారం... సూర్యాపేటకు చెందిన మంగమ్మ (38) అహ్మదాబాద్ నుంచి కాచిగూడకు రైలులో వస్తుండగా మొత్కెడ్ - నాందేడ్ రైల్వే స్టేషన్ దగ్గర ఆమె బ్యాగు చోరీకి గురైంది. బ్యాగులో మూడున్నర తులాల బంగారు గొలుసు, రూ. 5 వేల నగదు, ఐఫోన్ ఉంది. కాచిగూడ రైల్వే పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ పీఎస్‌కు బదిలీ చేశారు.